https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 32 మంగళవారం 26-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## అంత సెంటిమెంటల్‌గా ఉండొద్దు!

**కాక్రోచ్ పార్టీపై అత్యవసరంగా దర్యాప్తు జరిపించాలన్న పిటిషన్‌పై సీజేఐ వ్యాఖ్య**






**హైదరాబాద్, మే 25**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' కార్యకలాపాలపై అత్యవసరంగా దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎన్‌కే గోస్వామి అనే న్యాయవాది దాఖలు చేసిన రిట్ పిటిషన్ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ.. ఈ అంశాన్ని అంత సెంటిమెంటల్‌గా (భావోద్వేగపూరితం గా) తీసుకోవద్దని పిటిషనర్‌కు సూచించారు. కాగా, ఇదే ధర్మాసనం ముందుకు మరో పిటిషన్ కూడా వచ్చింది. నకిలీ పట్టాలతో కొందరు న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నారని, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని మరో న్యాయవాది ఈ పిటిషన్ వేశారు. కోర్టులో విచారణ సందర్భంగా వ్యక్తమయ్యే పరిశీలనలు, వ్యాఖ్యలను బయట ప్రచారం కోసం కొందరు వాడుకుంటున్నారని, ఈ ధోరణిని అడ్డుకోవాలని కోరారు. దీనిని కూడా.. 'అంత తొందరేమీ లేదు.. మేం పరిశీలిస్తాం' అని పేర్కొంటూ సీజేఐ పక్కనపెట్టారు.

తనకు సీనియర్ న్యాయవాది హోదాను ఇవ్వాలని కోరుతూ ఓ లాయర్ దాఖలు చేసిన పిటిసన్ మీద మే 15న విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ 'బొద్దింకలు, పరాన్నజీవులు' అంటూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. నకిలీ డిగ్రీలతో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్న వారిని ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేశానని ఆయన తర్వాత వివరణ ఇచ్చారు.

# గింజ కూడా కొనట్లే..

**పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై కేంద్రాన్ని ప్రశ్నించాలి**
**బెంగాల్ ఎన్నికల వల్లే హమాలీల కొరత ఏర్పడింది**
**రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటాం**
**వామపక్ష నేతలతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి**
**40 లక్షల టన్నులపైగా ధాన్యం రోడ్లపైనే ఉంది**
**వర్షాలు పడితే పంట దెబ్బతినే ప్రమాదం: సీపీఎం**
**సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్**



**హైదరాబాద్, మే 25**
వరి ధాన్యానికి మద్దతు ధర ప్రకటించిన కేంద్రం.. ఒక్క గింజనూ కొనడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పండిన పంటలో 30శాతమైనా సేకరించడం లేదని, పంట ఉత్పత్తుల కొనుగోలుపై కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సచివాలయంలో సోమవారం పలువురు వామపక్ష నేతలు సీఎంతో సమావేశమై ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీఇచ్చారు. బెంగాల్ ఎన్నికల వల్ల హ మాలీల కొరత ఏర్పడిందని తెలిపారు.

ఎండల వల్ల మధ్యాహ్నం సమయంలో పనులు జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నామని చెప్పారు. రూ.500బోనస్ ఇచ్చి సన్న వడ్లు కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని, నష్టం వస్తుందని తెలిసినా తాము మొక్కజొన్న కొనుగోలు చేశామని తెలిపారు. కేంద్రం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని స్పష్టంచేశారు. కాగా, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును బీఆర్ఎస్, బీజేపీ రాజకీయం చేస్తున్నాయని, మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం తెలిపారు. మూసీ ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు నాణ్యమైన జీవన సదుపాయాలు కల్పించడమే తమ ఉద్దేశమన్నారు. కాగా, ప్రభుత్వవిద్యను ప్రక్షాళన చేస్తామని సీఎం స్పష్టంచేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆరుట్ల స్కూల్‌ను ఒక సారి సందర్శించాలని సీపీఎం నాయకులకు సూచించారు. అంతకుముందు పలు అంశాలపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో ప్రతినిధుల బృందం సీఎంకు వినతి పత్రం అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం బృందం సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ప్రస్తుతం 40 లక్షల టన్నుల ధాన్యం రోడ్లపై ఉందని, వర్షాలు పడితే పంట దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపింది. ఈ మేరకు సీఎం స్పందిస్తూ.. ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. కనీస వేతన సవరణలు అన్‌స్కిల్డ్ వర్కర్లకు మాత్రమే ఉపయోగపడేలా ఉన్నాయని, స్కిల్డ్, హైస్కిల్డ్ కార్మికులకు ఉపయోగం లేదని సీఎంకు వివరించగా.. పరిశీలించాలని అప్పటికప్పుడు అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఉద్యోగ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారని, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరగా.. నెలలోగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వివరించింది. సీపీఎం నాయకుడు సామినేని రామారావు హత్యపై సిట్ ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పినట్లు వెల్లడించింది.

**భూదాన్ భూముల్లో పేదలకు పట్టాలివ్వండి: సీపీఐ**
భూధాన్ భూములు, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సీఎంను కోరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక చేపట్టాలని, మొక్కజొన్న రైతులకు బకాయిలు చెల్లించాలని కోరింది.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

**ఏపీ ప్రభుత్వానికి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత హెచ్చరిక**



**హైదరాబాద్, మే 25** : ఏపీ ప్రభుత్వం ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను హైదరాబాద్‌లోనే అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని.. అదే జరిగితే ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసుల పేరుతో వేధిస్తున్నాయని సోమవారం ఎక్స్'వేదికగా ఆమె మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్‌పై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలు చేస్తున్నారన్నారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు గౌరవించే మేధావిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదుచేసి వేధింపులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాగా, వడదెబ్బ మృతుడి కుటుంబానికి భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ వాహనం ఇవ్వకపోవటంతో... కిలోమీటర్‌కు పైగా మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఉదంతంతో రేవంత్‌రెడ్డిది అమానవీయ ప్రభుత్వమని, పేదలపట్ల ఎంత నిర్దయగా ఉందో అర్థమవుతోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# గాలివాన బీభత్సం పలు జిల్లాల్లో తీవ్ర విధ్వంసం

**నేలకొరిగిన తోటపంటలు, విద్యుత్ స్తంభాలు**



**హైదరాబాద్, మే 25 :**
రాష్ట్రంలో సోమవారం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. గాలిదుమారానికి తోటపంటలు, భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. పత్తిపాక ఎక్స్‌రోడ్ సమీపంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. ఎలిగేడు మండలం రాములపల్లి బైపాస్ రోడ్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలింది. కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్, రాజన్నపేట, గుంటపల్లిచెరువుతండా గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఇల్లంతకుంట మండలంలోని కేసన్నపల్లె, పత్తికుంటపల్లె, గాలిపెల్లి, జవారిపేట తదితర గ్రామాల్లో ఈదురుగాలితో వడగళ్లవాన కురిసింది. మండలంలో ఈదురుగాలులకు 30 విద్యుత్ స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి కిందపడ్డాయని ఎన్పీడీసీఎల్ ఏఈ నగేష్ తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ గాలివాన విధ్వంసం సృష్టించింది. పలుచోట్ల వడగళ్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా అడ్లూరు, శోభనాద్రిగూడెం, తమ్మారం, జాన్‌పహాడ్ తదితర ప్రాంతాల్లో గాలుల ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక, కంచనపల్లిలో వడగళ్ల వాన కురిసింది. పలుచోట్ల చెట్లు రోడ్లకు అడ్డంగా పడడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**రైతులకు తీవ్ర నష్టం**
గాలివానతో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో కొనుగోలు కేంద్రాల్లోని మొక్కజొన్నలు, ధాన్యం తడిసిపోయాయి. మెదక్‌లో వృక్షా లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మార్కెట్ యార్డులో ధాన్యం తడిసింది. చాలాప్రాంతాల్లో 3 గంటలపాటు కరెంట్ నిలిచిపోయింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, కోహీర్ మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సిద్దిపేట జిల్లా కుందనవానిపల్లి, మైసమ్మవాగు తండా, గండిపల్లి, చౌటకుంట తండాలో కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్, పోచారం ఎదులాబాద్ డివిజన్లలో గాలివాన తీవ్ర నష్టం కలిగించింది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో గాలివానతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గొల్లపల్లిలో సోమవారం ఓల్లాల లక్ష్మయ్య (60) అనే గొర్రెల కాపరిపై గోడ కూలి మృతి చెందాడు.

# మళ్లీ భారీగా పెట్రో బాదుడు!

**లీటరు పెట్రోల్‌పై రూ.2.61**
**డీజిల్‌పై రూ.2.71 పెంపు**
**2 వారాల్లోపే నాలుగోసారి పెంచిన వైనం**
**మొత్తంగా లీటరుకు రూ.7.50 పెరుగుదల**
**అంతర్జాతీయంగా ముడిచమురు ధర తగ్గిన రోజే దేశంలో భారీగా పెంపు!**
**ధరలు పెంచే మనిషి మళ్లీ బాదారు: రాహుల్**
**సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ సర్కారు పెట్రోల్ చల్లుతోంది: ఖర్గే**



**న్యూఢిల్లీ, మే 25:**
దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. ఈసారి చమురు సంస్థలు భారీగా పెంచేశాయి. సోమవారం లీటరు పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున బాదేశాయి. రెండు వారాల్లోపే నాలుగోసారి ధరలు పెంచాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరిందని, 60 రోజులు హోర్ముజ్‌ను తెరుస్తారన్న వార్తల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర దాదాపు 5 శాతం పడిపోయింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర సోమవారం ఒక దశలో 95.41 డాలర్లకు తగ్గగా.. దేశంలోని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రో ధరలను భారీగా పెంచడం గమనార్హం. తాజా పెంపుతో పెట్రో ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. రెండున్నరేళ్ల పాటు దేశంలో పెట్రో ధరలను పెంచలేదు. చివరిసారిగా 2024లో సార్వత్రిక ఎన్నికల ముందు పెట్రో ధరలు లీటరుకు రూ.2 చొప్పున తగ్గించారు. కాగా, ఈ నెల 15 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు ధరలు పెంచారు. తాజా పెంపుతో పెట్రో ధరలు మొత్తంగా లీటరుపై రూ.7.50 పెరిగినట్లయింది. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12కు, డీజిల్ రూ.95.20కు.. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74కు చేరాయి. అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి క్రూడాయిల్ ధరలు 50 శాతంపైగా పెరిగాయని.. అయినా ఆ భారం ప్రజలపై వేయలేదని చమురు సంస్థలు చెబుతున్నాయి. ద్రవ్యోల్బణం ముప్పును తప్పించేందుకు కేంద్ర ఆదేశాల మేరకే ధరలు పెంచలేదని అంటున్నాయి. తాజాగా అంతర్జాతీయంగా చమురు ధర కేవలం 5 శాతమే తగ్గిందని చెబుతున్నాయి. ప్రతిపక్షాలు మాత్రం కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. కీలకమైన రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసేవరకు ఆగి, ఇప్పుడు భారీగా ధరలు పెంచేస్తోందని ఆరోపిస్తున్నాయి. మళ్లీ పెట్రో ధరలు పెంచిన నేపథ్యంలో ప్రధాని మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ధరలు పెంచే మనిషి' మళ్లీ బాదేశారంటూ సోమవారం ఘాటు విమర్శలు చేశారు. "మోదీకి ఒకటే పని. అదేంటంటే ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం. ఇతర సమయాల్లో జనాల జేబులు గుల్ల చేయడం" అని రాహుల్ ఆరోపించారు. దేశంలో ఆర్థిక తుఫాను వస్తుందని కొన్ని నెలల నుంచే తాను హెచ్చరిస్తున్నానని.. మోదీ మాత్రం ఎన్నికల హడావుడిలో, అవి ముగిసిన తర్వాత పెట్రో ధరలు పెంచడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న పెట్రో ధరలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోజువారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల్లోపే పెట్రోల్, డీజిల్ ధరలను నాలుగోసారి పెంచారని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని చెప్పారు. 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు వరసగా 5.8, 4.4, 3.9 శాతం పెరిగాయని.. ప్రజల కంటే కంపెనీల లాభాలకే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. దేశంలో పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించడంలో భాగంగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై ఇస్తున్న సబ్సిడీలను మరింత పెంచాలని కేంద్రం యోచిస్తోంది. చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే దిశగా ప్రతిష్ఠాత్మక పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాల సబ్సిడీల కోసం భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు నిధులను కోరాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన పరిశీలనలో ఉందని.. అయితే నిధుల మొత్తం ఎంతనేది ఇంకా నిర్ణయించలేదని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 'గత 2 నెలలుగా దీనిపై చర్చ జరుగుతోంది' అని సంబంధిత అధికార వర్గాలు వెల్లడించాయి. 2024లో పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని ప్రారంభించినప్పుడు 24.7 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను సబ్సిడీ కింద ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## కృష్ణా, భీమా నదులపై ఉమ్మడి బ్యారేజీలు!

**తెలంగాణ, కర్ణాటక మంత్రులు ఉత్తమ్, బోసురాజు చర్చలు**
**అధ్యయనానికి సంయుక్త కమిటీ వేయాలని నిర్ణయం**
**కృష్ణానీటి గరిష్ఠ వినియోగంపై చర్చించాం: మంత్రి ఉత్తమ్**
**తెలంగాణ నిధులిస్తే ఆర్డీఎస్‌ను ఆధునీకరిస్తామన్న బోసురాజు**



**హైదరాబాద్, మే 25**
కృష్ణా జలాల గరిష్ఠ వినియోగం కోసం కృష్ణా, భీమా నదులపై ఉమ్మడి బ్యారేజీలు నిర్మించే అంశంపై తెలంగాణ, కర్ణాటక మంత్రులు సోమవారం చర్చలు జరిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కు మార్‌రెడ్డితో కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల తాగు, సాగునీటి అవసరాల కోసం కృష్ణా నదిపై కొల్పూరు వద్ద ఒక బ్యారేజీ కమ్ బ్రిడ్జి.. భీమా నదిపై తంగిడి వద్ద మరో బ్యారేజీ నిర్మించే అంశంపై చర్చించారు. కొల్పూరు వద్ద బ్యారేజీ కమ్ బ్రిడ్జి నిర్మిస్తే.. ఎడమవైపు తెలంగాణ, కుడి వైపు కర్ణాటక లాభపడతాయని కర్ణాటక మంత్రి ప్రతిపాదించారు. భీమాపై తంగిడి వద్ద 0.5 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మిస్తే ఇరు రాష్ట్రాల తాగు, సాగునీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. బ్యారేజీల నిర్మాణంపై విస్తృతంగా చర్చించేందుకు సంయుక్త కమిటీ వేయాలని మంత్రులు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు చేపట్టాలని ఆ ప్రాంత ఎమ్మెల్యేలు కోరగా.. తెలంగాణ ప్రభుత్వం నిధులిస్తే వెంటనే పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని కర్ణాటక మంత్రి తెలిపారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పరస్పర అవగాహనతో కృష్ణా జలాలను గరిష్ఠంగా వినియోగించుకొనే అంశంపై చర్చలు జరిపినట్లు చెప్పారు. తాగు, సాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం కలగకుండా.. ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండేలా చర్చలు జరిగాయన్నారు.

MANA SAMAJAM

మన సమాజం

తెలుగు డిజిటల్ దినపత్రిక

మంగళవారం, మే 26, 2026

# ధాన్యం కొనుగోలులో జాప్యం రైతుల ఆవేదన





**ధర్మపురి మే25**

ఈరోజు భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ గారి ఆధ్వర్యంలో ధర్మపురి లోని వడ్లు మరియు మక్కల కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వడ్ల, మక్కల రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని. వడ్ల మక్కల రైతులతో కలిసి ధర్మపురి తాసిల్దార్ ఆఫీస్ ను ముట్టడించడం జరిగింది. రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వడ్ల కొనుగోల జాప్యం పై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేయడం. వరి కోసి వడ్లను కొనుకోలు కేంద్రంలో పోసి ఇప్పటికీ రెండు నెలలు అయినా కూడా జోకడం లేదు, మ్యాచర్ వచ్చినా కూడా జోకటం లేదు, భారదాను,సంచులు, సుత్తిల్లు లేదని లేవని మ్యాన్ పవర్ లేదని ఏదో ఒకటి సాకు చెప్తూ వస్తున్నారు, మ్యాచర్ వచ్చి జోకిన బస్తాలను తీసుకపోవడం లేదు , తీసుక వెళ్లిన బస్తాను డబ్బులు పడే సమయంలో ఒక రైతుకు ఒక బస్తా రెండు బస్తాల చొప్పున వడ్ల డబ్బులు కట్ చేస్తూ డబ్బులు వేస్తున్నారు. మరి ఇట్టి విషయంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ గారు రైతుల పక్షాన గత రెండు మూడు రోజుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వడ్లు,/మక్కలను వెంటనే కొనుగోలు చేసి ఎలాంటి కోతలు లేకుండా రైతు అకౌంట్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేయడం జరిగింది లేని ఎడల రైతుల పక్షాన రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరాసన కార్యక్రమాలు చేస్తామని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో రైతులతో పాటు పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు అప్పం శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, బీజేవైఎం నాయకులు మండలోజీ,సూరజ్ ,కార్యదర్శి కలకోట రాజు, కోశాధికారి సంఘీ రాజేష్, బీజేపీ,బీజేవైఎం నాయకులు , ఆనందాసు నవీన్ సోమ్ శెట్టి శివ సాయి, పూదరి పవన్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ మరియు తదితరులు పాల్గొన్నారు

# భూముల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల సవరణ సమావేశం

## జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్



**జగిత్యాల మే 25**

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మార్కెట్ విలువల ( రివైజ్డ్ మార్కెట్ వాల్యూస్) సవరణలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం సోమవారం విజయవంతంగా ముగిసింది జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరై మార్కెట్ విలువల పునర్విమర్శపై విస్తృతంగా చర్చించారు సమావేశంలో ప్రభుత్వం జారీ చేసిన జిఓ ఎంఎస్ నెం 41 రెవెన్యూ (రిజిస్ట్రేషన్-×) శాఖ తేదీ 25 4 2025 ప్రకారం భూ మార్కెట్ విలువల సవరణకు సంబంధించిన మార్గదర్శకాలు పట్టణ గ్రామీణ ప్రాంతాల వర్గీకరణ వ్యవసాయ వ్యవసాయేతర భూముల విలువల నిర్ణయం ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న ఆస్తుల ప్రత్యేక విలువల నిర్ణయం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది అదనంగా పట్టణ ప్రాంతాలు గ్రామపంచాయతీలు మున్సిపాలిటీ ప్రాంతాలలో మార్కెట్ విలువల నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన కమిటీల బాధ్యతలు విధానాలు స్థానిక స్థాయిలో అనుసరించాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించబడింది జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ పరిధుల్లో భూముల ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను పరిశీలించి పారదర్శకంగా ప్రజలకు అనుకూలంగా మార్కెట్ విలువల సవరణ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించబడింది ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లత ఆర్డీవోలు మధుసూదన్ నరసింహ రావు జీవాకర్ రెడ్డి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు ఎంపిడివోలు మునిసిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# మెట్‌పల్లి మున్సిపాలిటీలో సాధారణ సమావేశం





**మెట్టుపల్లి, మే 25**

ఈరోజు మెట్ పల్లి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగినది.మెట్ పల్లి పురపాలక సంఘ కార్యాలయంలో గౌరవ చైర్ పర్సన్ అధ్యక్షతన ఈరోజు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగినది. ఇట్టి సమావేశంలో (29) అంశాలను పొందుపరచగా అట్టి అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపినారు. అనంతరం గౌరవ కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ అన్ని వార్డులలో అవసరం ఉన్న చోట సి.సి. రోడ్లను వెంటనే నిర్మించాలని కోరినారు. అందుకు గౌరవ చైర్ పర్సన్ మాట్లాడుతూ దశలవారీగా సి.సి రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపినారు.ఇట్టి సమావేశంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ శ్రీ మైలారపు లింబాద్రి , మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీ డి. శ్రీనివాస్ గౌడ్, డి.ఇ.ఇ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి,టి.పి.ఓ రాజేంద్రప్రసాద్, ఆర్.ఓ. మిర్జా అజ్మతుల్లా బేగ్, జె.ఎ.ఓ రమేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, గౌరవ కౌన్సిలర్స్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలు కాల్చితే భారీ జరిమానా!

## రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి

**హైదరాబాద్, మే 25**

వానాకాలం సీజన్ కోసం భూములను సిద్ధం చేసే క్రమంలో రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టడం చట్టరీత్యా నేరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి హెచ్చరించారు. పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ జారీ చేసిన జీవో 27 ప్రకారం వ్యర్థాల దహనాన్ని పూర్తిగా నిషేధించామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సాధారణ చెత్తను కాల్చితే రూ.5 వేలు, అదే భారీ స్థాయిలో వ్యర్థాలను తగులబెడితే రూ.25 వేల వరకు పర్యావరణ పరిహారం (జరిమానా) విధిస్తామని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల గాలి కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతినడమే కాకుండా, ముఖ్యంగా వేసవి కాలంలో మంటలు వేగంగా వ్యాపించి ఎద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని డైరెక్టర్ హెచ్చరించారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో చాగర్ల చంద్రమౌళి, భాగ్యమ్మ అనే ఇద్దరు రైతులు ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రైతులు ఇలాంటి సులభమైన మార్గాలను ఎంచుకోకుండా, పంట అవశేషాలను నేలలోనే కలియదున్నాలని విజ్ఞప్తి చేశారు. అలా చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడి వస్తుందని, రసాయన ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చు కూడా కలసివస్తుందని వివరించారు.




# మున్నూరుకాపు కార్పొరేషన్‌కు కొత్త దిశ

## సీఎం రేవంత్‌ను కలిసిన చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

**హుస్నాబాద్/కరీంనగర్, మే 25**



సీఎంను కలిసిన బొమ్మ శ్రీరామన్న

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌజ్ ఫెడ్ పూర్వ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఇటీవల తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమి తులైన నేపథ్యంలో ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, తనపై నమ్మకం ఉంచి మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మున్నూరుకాపు సామాజిక వర్గ అభివృద్ధి కోసం కార్పొరేషన్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకోగా, మున్నూరుకాపు వర్గ అభ్యున్నతికి కొత్త ఊపిరి తీసుకురానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రాణం తీసిన ఈత సరదా

**ధర్మపురి మే25**

ధర్మపురి మండలం లోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లింగాల అక్షయ్ 19 ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. కొరండ్లపల్లె గ్రామానికి ఈత కొట్టేందుకు వచ్చిన అక్షయ్ బావిలో పడి మునిగి చనిపోయాడు. సంఘటన స్థలంలోని గ్రామ ప్రజలు సమాచారం అందుకొని వెళ్లి బావిలో నుంచి తీసినప్పటికీ అతడు చనిపోయినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. జరిగినటువంటి సంఘటనపై ధర్మపురి ఎస్సై పూర్తి విచారణ చేస్తున్నారు.

# మంచినీటి సమస్యను తీర్చిన గ్రామ సర్పంచ్‌కి శాలువా సత్కారం




**కథలాపూర్ మే 25**

కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలో గత కొన్ని సంవత్సరా లుగా ప్రజలకు తాగునీటి కొరత ఉండడంతో గ్రామస్తులు చాలా ఇబ్బందుల పాలయ్యారు అయితే అదే పరిస్థితి ఈ వేసవికాలం ప్రారంభంలో ఉండడంతో నూతనంగా గ్రామ సర్పంచిగా ఎన్నికైనటువంటి శ్రీ బద్దం మహేందర్ గారి దృష్టికి ఇట్టి విషయాన్ని తీసుకెళ్లడం జరిగింది, పని పట్ల నిబద్ధత గ్రామానికి సేవ చేయాలనే భావం కలిగిన బద్దం మహేందర్ గారు ఇట్టి సమస్యను గ్రామంలో పైలెట్ ప్రణాళికగా తీసుకొని చెరువులో గల బోర్ వాటర్ ను పిల్లి గుట్ట వద్ద గల వాటర్ ట్యాంక్ కి పైపులైన్ ద్వారా అనుసంధానం చేసి దాని ద్వారా గ్రామ ప్రజలకు నీరును అందించడంతో గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈరోజు గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ బద్దం మహేందర్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ శాలువా సత్కారం చేయడం జరిగింది ,

# ట్రాన్స్ఫర్ పై వెళుతున్న ఏఈఓకి శాలువా సత్కారం చేసిన లోక బాపురెడ్డి

**కథలాపూర్ మే 25**

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో ఎాజుూ (వ్యవసాయం) గా బాధ్యతలు స్వీకరించి మండలంలో గత ఏడు సంవత్సరాల నుంచి విశేష సేవలు అందించి మెట్ పెల్లి కి ట్రాన్ఫర్ లో వెళ్తున్న +.శేఖర్ గారి విషయాన్ని తెలుసుకొని వారినీ సాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి కథలాపూర్ మండల కేంద్రంలో చేసిన సేవలు అలాగే మెట్ పెల్లి లో కూడా తమ యొక్క సేవలు చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించిన రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి

# అయితుపల్లి గ్రామం లో అంగన్వాడీ 3వ సెంటర్లో 99 డేస్ అక్షన్ ప్లాన్ ప్రోగ్రాము



**పెగడపల్లి మే 25**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం అయితుపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రం 3వ (మూడవ )లో సెంటరల్లో 99 డేస్ అక్షన్ ప్లాన్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఉమెన్స్ వీక్ జరిగింది ఇందులో సర్పంచ్ - మ్యకల అంజమ్మ ఉప సర్పంచ్ - గోలి సంజీవ రెడ్డి వార్డు మెంబర్ - పద్మ, సూపర్ వైజార్ -సుభద్ర సెక్రటరీ -మంజుల ఆశ -జి .నిర్మల, అంగన్వాడీ టీచర్ టి మిర్యాని , పి అంజమ్మ ,ఎాషుూ-విజయ లక్ష్మీ , సఫియా బేగం గర్భిణీ స్త్రీలు, మహిళలు వారందరూ పాల్గొన్నారు, మరియు వంటల ప్రోగ్రాం పెట్టడం జరిగింది ఇందులో పి సుప్రజ విక్రమ్, ఎన్ .పుష్పలత ప్రశాంత్, బి మౌనిక సూర్య, పాలుగోన్నారు వారికీ బహుమతులు కూడా ఇవ్వడం జరిగింది.

# ఎవరీ 'నకిలీ' గంగాధరుడు..?

- గంగాధరుడి వెనుక మరింత పెద్ద నెట్‌వర్కే ఉందా..?
- గ్రామ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు విస్తరించిన దళారుల వ్యవస్థ..!
- రైతుల అమాయకత్వమే పెట్టుబడిగా సాగుతున్న దందా..?
- విత్తన సరఫరా నుండి విక్రయాల వరకు దళారుల రాజ్యం
- అసలు సూత్రధారులపై చర్యలు ఎప్పుడు..?
- గంగాధరుడి గలీజు విక్రయ దందా - 2

**మంచిర్యాల, మే 25 (మన సమాజం):**

**జిల్లాలో నకిలీ విత్తనాల దందాపై చర్చలు కొనసాగుతున్న వేళ, గంగాధరుడి వ్యవహారం చుట్టూ కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఒక వ్యక్తి చుట్టూ తిరుగుతున్నట్లు కనిపించిన ఈ వ్యవహారం వెనక మరింత పెద్ద నెట్‌వర్క్ పని చేస్తోందా..? అనే కోణంలో చర్చలు మొదలయ్యాయి. గ్రామ స్థాయి మధ్యవర్తులు, సరఫరాదారులు, రవాణా వ్యవస్థ, విక్రయ దళారులు ఇలా పలు స్థాయిల్లో ఒక గొలుసు మాదిరిగా వ్యవస్థ పని చేస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.**




వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల అవసరాలను గుర్తించి, తక్కువ ధరలకు లేదా అధిక దిగుబడి వస్తుందని నమ్మిస్తూ నకిలీ విత్తనాలను మార్కెట్లోకి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో ఇప్పటికే పరిచయాలు పెంచుకున్న కొందరు వ్యక్తుల ద్వారా రైతులకు చేరువై, వాటిని అసలు కంపెనీ విత్తనాలుగా ప్రచారం చేస్తున్నారని తెలుస్తోంది.

**నకిలీ విత్తనాల వెనుక భారీ ఆర్థిక లావాదేవీలు..?**

ఈ దందాలో భారీ మొత్తంలో డబ్బు చేతులు మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. విత్తన సరఫరా నుంచి విక్రయాల వరకు ప్రతి దశలో మధ్యవర్తులకు వాటాలు వెళ్తున్నాయని, అందుకే అసలు మూలాలను బయటకు తీయడం కష్టంగా మారుతోందని చర్చ జరుగుతోంది. ఒక స్థాయిలో పట్టుబడిన వారు కేవలం చిన్న చేపలే తప్ప, అసలు పెద్ద తలకాయలు మాత్రం బయటకు రావడం లేదనే అభిప్రాయాలు జోరుగానే వినిపిస్తున్నాయి. రైతుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది. నకిలీ విత్తనాల పేరుతో రైతులను మోసం చేస్తున్న అసలు సూత్రధారులను గుర్తించి పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులు మోసపోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే నకిలీ విత్తనాల పని పట్టడానికి శాయశక్తులా కృషి, నిఘా విభాగాన్ని అప్రమత్తం చేసిన పోలీసు ఉన్నతాధికారులు నకిలీ చాయల మూలాల్ని పెకిలించి వేయాల్సిన ఆవశ్యకత కూడా ఎంతైనా ఉంది.

## బెల్లంపల్లిలో ఘనంగా "సువాగత్ లాడేసర్ ఆంగనియా" వేడుకలు

### ఆడబిడ్డలతో అనుబంధాన్ని చాటిన మార్వాడీ సమాజం





**బెల్లంపల్లి మే 25 మన సమాజం**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఆడబిడ్డలకు ఉన్న ప్రత్యేక స్థానం మరోసారి ప్రతిబింబించేలా బెల్లంపల్లిలో మార్వాడీ సమాజం ఆధ్వర్యంలో "సువాగత్ లాడేసర్ ఆంగనియా" కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 400 మంది మహిళలు, ఆడబిడ్డలు పాల్గొని కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య విజయవంతం చేశారు. భారతీయ కుటుంబ వ్యవస్థలో ఆడబిడ్డలను ఐశ్వర్యానికి, శుభానికి ప్రతీకలుగా భావిస్తారు. వారి సాన్నిధ్యం లేకుండా ఏ శుభకార్యమూ పూర్తికాదనే భావనకు మార్వాడీ సమాజం ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. ముఖ్యంగా మూడు నుంచి నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాసంలో వివాహిత కుమార్తెలను పుట్టింటికి ఆహ్వానించి, ప్రేమాభిమానాలతో సత్కరించే సంప్రదాయాన్ని "సువాగత్ లాడేసర్ ఆంగనియా" పేరుతో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా బెల్లంపల్లిలో జరిగిన వేడుక భావోద్వేగపూరిత క్షణాలకు వేదికైంది. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న మహిళలు, కుమార్తెలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందభాష్పాలు పంచుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు, నగరాల నుంచి వచ్చిన మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల పలువురు మహిళలు కూడా హాజరుకావడం ఈ సంప్రదాయానికి ఉన్న భావోద్వేగ, సాంస్కృతిక విలువను తెలియజేసింది. కార్యక్రమం శ్రీకృష్ణ మందిరం నుంచి ప్రారంభమైన వైభవోపేత శోభాయాత్రతో మొదలై మహేశ్వరి భవన్ వరకు కొనసాగింది. అక్కడ అతిథులకు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం వైదిక్ ఫంక్షన్ హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, వినోద ప్రదర్శనలు నిర్వహించి ఆహూతులను అలరించారు. చివరగా మహిళలు, ఆడబిడ్డలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి సభ్యునికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ చితలంగి, సుష్మా లహోటి, రాఖీ శర్మ, ఉపాధ్యక్షులు సులోచన లోయా, పింకీ అగ్రవాల్, సంయుక్త కార్యదర్శులు తారా లోయా, ప్రియాంక సోమాని, సభ్యులు లీలా జీ బాంగ్, ఊర్మిళ ఝూన్వర్, సునీత ఝూన్వర్, సంగీత జైన్, నిషా లోయా, కుసుమ్ సోనీ, జ్యోతి అగ్రవాల్, అనురాధ పరాఖ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌గా ఉండేందుకు ఎలాంటి డైట్ ఫాలో కావాలంటే.?

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. కానీ డైట్ విషయంలో సరైన శ్రద్ధ చూపరు. ఫిట్‌గా ఉండటం అంటే తక్కువ తినడం మాత్రమే కాదు, సరైన పోషకాలు ఉన్న ఆహారాన్ని సరైన పరిమాణంలో తీసుకోవాలి. మంచి నిద్ర, రోజూ వ్యాయామం తప్పనిసరి అంటున్నారు వైద్య నిపుణులు. ఫిట్‌గా ఉండాలంటే.. పాలు, అరటిపండు, ఖర్జూరాలు, పండ్లు, ఓట్స్ వంటి ఆహారాలు తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**1. కూరగాయలు, పండ్లు:**

రోజూ కనీసం రెండు రకాల పండ్లు, ఆకుకూరలు మీ ఆహారంలో ఉండేలా చూసుకోండి. వీటిలో ఉండే ఫైబర్(పీచు) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.


**2. నీరు:**

శరీరం ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నీరు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి, కండరాల పనితీరును పెంచి, అలసటను తగ్గించి, విష పదార్థాలను బయటకు పంపుతుంది.

**3. జంక్ ఫుడ్‌కు దూరం:**

ప్రస్తుతం బిజీ లైఫ్‌లో చాలా మంది ఇన్‌స్టంట్ ఫుడ్‌పై ఆధారపడుతున్నారు. జంక్ ఫుడ్ అంటే పిజ్జా, బర్గర్లు, సమోసాలు, ఫ్రైడ్ రైస్, మంచూరియా, నూడుల్స్ వంటి నూనెలో వేయించిన పదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండాలి.

## 'విద్యా హక్కు' ఇకనైనా అమలవుతుందా?




'విద్యా హక్కు' ఇకనైనా సుప్రీంకోర్టు ఇటీవల ఒక చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. 'ఒక ఆటో డ్రైవర్ లేదా వీధి వ్యాపారి బిడ్డ, ధనవంతుల బిడ్డతో కలిసి పాఠశాలలో ఒకే బెంచీపై కూర్చోవడం అనేది సహజ మైన, నిర్మాణాత్మకమైన ప్రక్రియగా మారాలి. ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు. ఆర్టికల్ 21ఏ, 39(ఎఫ్) కింద దేశం చిన్నారులకు ఇచ్చిన హక్కు' అని కోర్టు పేర్కొంది. కులం, తరగతి లేదా ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఉండే 'అనుమానాస్పద గుర్తింపులను' పక్కన పెట్టి, విద్యార్థులు ఒకరితో ఒకరు మమేకంగా ఉండటానికి సెక్షన్ 12 దోహదపడుతుందని ధర్మాసనం వివరించింది. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఒకటవ తరగతిలో కనీసం 25శాతం సీట్లు ఉచిత విద్య కోసం సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు తప్పనిసరిగా కేటాయించాలి. విద్యాహక్కు చట్టం అమలుచేయని రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణ, ఈ తీర్పును గంభీర హెచ్చరికగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో వచ్చిన ముఖ్యమైన చట్టాల్లో విద్యా హక్కు చట్టం ఒకటి. ఇది అమలులోకి వచ్చి పదిహేనేళ్లు గడిచినా, తెలంగాణలో ఆ చట్టం అమలుకు గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ చట్టం ఊసే ఎత్తకపోవడం విచారకరం. ఏడాదికేడాది ప్రభుత్వాలు తమ చట్టబద్ధ బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. యూడీ ఐఎస్‌ఈ 2024--25 గణాంకాల ప్రకారం, తెలంగాణలో 1 నుంచి 10 తరగతుల వరకు చదువుతున్న పిల్లల సంఖ్య సుమారు 62 లక్షలు. దాదాపు 59.5 శాతం మంది పిల్లలు ప్రైవేటులో చదువుతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రైవేటు బడుల్లో 30 లక్షల మంది విద్యార్థులు ఉంటే, ఇప్పుడది దాదాపు 37 లక్షలకు చేరింది. మరి రాష్ట్ర ప్రభుత్వం పదే పదే ప్రకటించే విప్లవాత్మక మార్పులు ఎప్పుడు వస్తాయో అర్థం కావడం లేదు. ఇదే విద్యా సంవత్సరంలో 1 నుంచి 5 తరగతులలో మొత్తం 30.48 లక్షల విద్యార్థులు నమోదు అయితే, అందులో 20.66 లక్షల విద్యార్థులు ప్రైవేటు బడుల్లో చేరారు. ఒకటవ తరగతిలో 6.62 లక్షల మంది చేరితే, 4.79 లక్షల విద్యార్థులు (72.4 శాతం) ప్రైవేటు బడుల్లో చేరారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం ఎంతగా క్షీణించిందో ఈ గణాంకాలే సాక్ష్యం. దేశం మొత్తంలో 7,993 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంటే మన రాష్ట్రంలోనే 2,245 (28శాతం) జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు ఉన్నాయి. గ్రామాల్లో బడుల నిర్వహణ, వసతులు లేని కారణంగా విద్యార్థులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో 5,001 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 68 వేల మంది విద్యార్థులు నమోదయ్యారు. అంటే నాణ్యమైన విద్యను ఆశించే తల్లిదండ్రులు ఈ పాఠశాలల మీద నమ్మకం కోల్పోతున్నారు. ఒకసారి పాఠశాల మూసుకుపోతే, ఆ గ్రామంలో ప్రభుత్వ విద్యను పునరుద్ధరించటం చాలా కష్టం. పరిపాలనా స్థాయిలో కూడా పరిస్థితి బలహీనంగానే ఉంది. 630 మండల విద్యాశాఖాధికారుల్లో కేవలం 14 మంది మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారు. కేవలం ముగ్గురు జిల్లా విద్యాధికారులే పూర్తి బాధ్యతలతో ఉన్నారు. దీని ప్రభావం పర్యవేక్షణ, నాణ్యత, బాధ్యత అన్నింటిపైనా పడుతోంది. విద్యకు కేటాయించే బడ్జెట్ విషయంలో తెలంగాణ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉంది. 2014--15లో 10.89శాతంగా ఉన్న విద్యా బడ్జెట్, 2024--25 నాటికి 7.5శాతానికి పడిపోయింది. ఇది కొఠారి కమిషన్ సూచించిన 20శాతం, జాతీయ సగటు 15శాతంతో పోలిస్తే చాలా తక్కువ. బడ్జెట్ తగ్గిన కొద్దీ, మౌలిక వసతులు, ఉపాధ్యాయ నియామకాలు, విద్యా నాణ్యత అన్నీ ప్రభావితమవుతున్నాయి. ఎన్‌ఎస్‌ఎస్ 80వ సర్వే ప్రకారం, ఒక విద్యార్థిపై సగటు వార్షిక ఖర్చు రూ.50,000కు చేరుతోంది. తెలంగాణలో దాదాపు 37 లక్షల మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని భావిస్తే, తల్లిదండ్రులు ఏటా సుమారు రూ.18,500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారంగా మారింది. ఇక ఇంటర్ విద్యను కలిపితే ఈ ఖర్చు ఇంకా ఎక్కువగానే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతిపాదన చేసింది. ఇవి కేవలం 2,68,800 విద్యార్థులకు మాత్రమే ఉపయోగపడతాయి. తెలంగాణలో ప్రజా విద్యను పునరుజ్జీవింప చేయాలంటే 2026--27 సంవత్సరానికి విద్యకు కనీసం 20శాతం బడ్జెట్ కేటాయించాలి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు నమోదు అయిన పాఠశాలలను గుర్తించి సిబ్బంది కొరత లేకుండా వాటికి అన్ని వసతులు కల్పించాలి. విద్యా హక్కు చట్టాన్ని జిల్లాల వారీగా కఠినంగా అమలు చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సెక్షన్ 12(1)(సి)ను వెంటనే అమలుచేయాలి. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రి ంచాలి. బాలలందరికీ సమాన విద్య అందించాలంటే ఎక్కువ ప్రభుత్వ వనరులు, మెరుగైన ఉపాధ్యాయులపై అధిక శ్రద్ధ పెట్టాలి. సంక్షేమ పథకాలతో అసమానతలను అంతం చేయడం కష్టం. ప్రభుత్వ నిధులతో కూడిన సమాన, సార్వత్రిక విద్య మాత్రమే సమాజంలో కృత్రిమంగా సృష్టించబడిన సామాజిక అసమాన తలను కూల్చివేస్తుంది. ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసినప్పుడు లేదా ప్రైవేటీకరిం చినప్పుడు, అసమానతలు కొత్త రూపాల్లో ఏర్పడతాయి. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని తమ తీర్పులో పేర్కొన్నది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.




## నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది. అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పుకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## వ్యూస్ కోసం దిగజారొద్దు..

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా మరియు జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని మరియు ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా మరియు వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్ మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.



## అవన్నీ రూమర్లే!



అచ్చు తెలుగందం శ్రీలీలకు యువతరంలో ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. అందుకే ఈ అమ్మడు విజయాలతో సంబంధం లేకుండా భారీ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. అదే సమయంలో గత కొంతకాలంగా ఈ భామ వ్యక్తిగత జీవితం గురించి రూమర్లు రావడం పరిపాటిగా మారింది. తాజాగా క్రికెటర్ తిలక్‌వర్మతో ఈ ఆమె డేటింగ్‌లో ఉందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. గత డిసెంబర్‌లో వీరిద్దరూ తిరుమలను సందర్శించడం, ఆపై ముంబయిలో టీ20 మ్యాచ్‌ను తిలకించడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా వీటిపై శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందించారు. ఇవన్నీ కేవలం పుకార్లేనని, వాటిలో ఎలాంటి వాస్తవం లేదని, ప్రస్తుతం శ్రీలీల కెరీర్ మీదనే దృష్టి పెట్టిందని వివరణ ఇచ్చారు. మరో ఐదేళ్ల తర్వాతే తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేశారు. గతంలో బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్‌లో ఉందనే ప్రచారం కూడా జరిగింది. ఈ వార్తలను కూడా స్వర్ణలత ఖండించారు. తానూ, కార్తిక్ ఆర్యన్ తల్లి ఇద్దరం గైనకాలజిస్టులం కావడంతో వృత్తిపరంగా కలుసుకొని అనేక విషయాలు మాట్లాడుకుంటామని, దీనిని కారణంగా చూపించి కార్తిక్ ఆర్యన్, శ్రీలీల మధ్య రిలేషన్‌షిప్ వార్తలను సృష్టించారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.

## ఇక తమిళం వంతు!

దక్షిణాది సంస్కృతి, సినిమాలు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తుంది అగ్ర కథానాయిక జాన్వీకపూర్. తన తల్లి, లెజెండరీ నటి శ్రీదేవి తరహాలోనే ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందాలన్నది తన లక్ష్యమని పలు సందర్భాల్లో చెప్పిందీ భామ. తెలుగు అరంగేట్ర చిత్రం 'దేవర'తో యువ హృదయాల్ని దోచుకున్న ఈ సొగసరి 'పెద్ది' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించబోతున్న విషయం తెలిసిందే.
ఇదిలావుండగా దక్షిణాదిలో తన మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకునే దిశగా జాన్వీకపూర్ అడుగులు వేస్తున్నది. ఈ నేపథ్యంలో ఆమె తమిళ సినీరంగంలో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అగ్ర నటుడు విక్రమ్ కుమారుడు ధృవ్ విక్రమ్ హీరోగా దర్శకుడు అరవింద్ కుమార్ ఓ న్యూఏజ్ లవ్‌స్టోరీని తెరకెక్కించబోతున్నాడు. ఇందులో జాన్వీకపూర్ కథానాయికగా ఖరారైందని సమాచారం. కథలోని కొత్తదనం, తన పాత్ర తీరుతెన్నులు నచ్చడంతో కోలీవుడ్ అరంగేట్రానికి ఇదే సరైన చిత్రమని ఆమె భావిస్తున్నదట.
త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. 'పెద్ది' చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ తమిళంలో ఈ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. 'పెద్ది'లో అచ్చియమ్మగా తన అందచందాలు, అభినయంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నదిజాన్వీకపూర్.

